

సవాలుగా సర్దుబాటు

- ఇన్‌చార్జీ ఎంఈవోలతో కరువవుతున్న పర్యవేక్షణ
- బదిలీ అయిన టీచర్ల రిలీవింగ్‌లో వివాదాలు
- వర్క్ అడ్జస్ట్‌మెంట్ విషయంలోనూ ఆరోపణలు
- జిల్లాలో సవాలుగా మారుతున్న టీచర్ల సర్దుబాటు

నిర్మల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖను సమస్యలు చుట్టుముడుతున్నాయి. ఒక సమస్య వెనక మరో సమస్య ఆ శాఖను వెంటాడుతున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికే ఎంఈవోలు లేక ఇన్‌చార్జీ ఎంఈవోలతో పాఠశాలల పర్యవేక్షణను నెట్టుకొస్తున్న విద్యాశాఖను మరిన్ని సమస్యలు చుట్టుముడుతున్నాయి. ఒక్కొక్క ఎంఈవో ఐదారు మండలాలకు ఇన్‌చార్జీగా వ్యవహరిస్తుండడం బాధ్యతల నిర్వహణకు భారంగా మారుతోంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేని చోట్ల సర్దుబాటు వ్యవహారం వివాదాలకు ఆస్కారమిస్తోంది. ఈ వ్యవహారంలో ఎంఈవోలపై ఆరోపణలు వస్తున్నందున వారు అదనపు బాధ్యతలను చేపట్టలేమంటూ చేతులెత్తేస్తున్నారు. ఇప్పటికే పెంబి, దస్తూరాబాద్ మండలాలకు ఇన్‌చార్జీగా ఉన్న మధుసూదన్ తానూ ఇన్‌చార్జీ ఎంఈవో బాధ్యతలను చేపట్టలేనంటూ ఏకంగా డీఈఓకు లేఖ రాయడం కలకలం రేపింది. ఇదిలా ఉండగా ఇటీవల వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరిట కొంతమంది ఉపాధ్యాయులను ఒక చోటు నుంచి మరో చోటుకు డిప్యూటేషన్ చేయడం మరింత వివాదానికి ఆజ్యం పోస్తోంది. ఓ ఉపాధ్యాయుడిని భైంసా డివిజన్ నుంచి అవసరం లేకున్నా మరో డివిజన్‌కు వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరిట డిప్యూటేషన్ ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమంటూ పీఆర్‌టీయూ టీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు నరేంద్రబాబు, రమణారావులు అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం ప్రస్తుతం ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది. ఈ వ్యవహారంపై విద్యాశాఖ డైరెక్టర్‌కు, కమిషనర్‌కు సైతం పీఆర్‌టీయూ తెలంగాణ నేతలు ఫిర్యాదు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా ఇటీవలే భైంసాలో ఓ మహిళ టీచర్ రిలీవింగ్ విషయంలో కూడా పెద్దఎత్తున గందరగోళం నెలకొన్న సంగతి తెలిసిందే. ఇలా వరుస వివాదాలు విద్యాశాఖను చు ట్టుముడుతుండడంతో ఆ శాఖ పనితీరు అలాగే పర్యవేక్షణపై ప్రభావం పడుతోందని అంటున్నారు.


డీఈవో రవీందర్‌రెడ్డిపై ఫిర్యాదు చేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు రమణారావు, నరేంద్రబాబు (ఫైల్)

చేతులెత్తేస్తున్న ఇన్‌చార్జీ ఎంఈవోలు

కాగా తమపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో కొంతమంది ఇన్‌చార్జీ ఎంఈవోలు తాము బాధ్యతలు నిర్వర్తించలేమంటూ చేతులెత్తేస్తుండడం గందరగోళానికి కారణమవుతోందంటున్నారు. ఇటీవల పెంబి, దస్తూరాబాద్, ఖానాపూర్‌తో పాటు భైంసా డివిజన్‌లో చోటు చేసుకున్న పలు సంఘటనలు విద్యాశాఖపై పలు ఆరోపణలకు ఆస్కారిమిస్తోందటున్నారు. ముఖ్యంగా ఇటీవలే బదిలీ అయిన టీచర్ల రిలీవింగ్ విషయంలో ప్రభుత్వ నిబంధనలు ఒక తీరుగా ఉండడం, క్షేత్రస్థాయిలో పరిస్థితులు మరో రకంగా ఉండడం కూడా సమస్యగా మారుతోందని అంటున్నారు. అయితే బదిలీ అయిన టీచర్లు తమను రిలీవ్ చేయాలంటూ ఎంఈవోలపై ఒత్తిడి తీసుకువస్తుండడమే కాకుండా ఈ వ్యవహారంలో టీచర్ల సంఘాలు జోక్యం చేసుకుంటుండడం సమస్యకు మరింత ఆజ్యం పోస్తోందని అంటున్నారు. తాము పీజీహెచ్‌యంలుగా కొనసాగుతూనే ఐదారు మండలాలకు ఇన్‌చార్జీ ఎంఈవోలుగా బాధ్యతలు నిర్వర్తిస్తుండడం సమస్యగా మారుతోందని, విధుల నిర్వహణ భారంగా మారుతోందని పలువురు ఎంఈవోలు బహిరంగంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడుగా ఎంఈవోలు నేరుగా తాము బాధ్యతలు నిర్వర్తించలేమంటూ డీఈవోకు, ఇతర ఉన్నతాధికారులకు లేఖలు రాస్తుండడం చర్చనీయాంశంగా మారుతోంది.

వివాదం సృష్టిస్తున్న వర్క్ అడ్జస్ట్‌మెంట్ వ్యవహారం

కాగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లు లేని చోట సమీప ప్రాంతాల్లో ఉన్న టీచర్లను వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరిట డిప్యూటేషన్ చేస్తున్న వ్యవహారాలు వివాదాలకు కారణమవుతున్నాయంటున్నారు. ఇటీవల కొంతమంది ఉపాధ్యాయులను వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరిట డిప్యూటేషన్ చేసిన వ్యవహారాలపై పెద్దఎత్తున ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ డిప్యూటేషన్‌లపై పీఆర్‌టీయూ టీఎస్ ఏకం గా కలెక్టర్‌కే కాకుండా విద్యాశాఖ కమిషనర్, డైరెక్టర్‌లకు సైతం ఫిర్యాదు చేస్తుండడం ప్రస్తుతం టీచర్ వర్గాల్లో చర్చ కు కారణమవుతోంది. నిబంధనల ప్రకారం సమీప ప్రాంతాల్లోని పాఠశాలల ఉపాధ్యాయులను వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరిట సర్దుబాటు చేయాల్సి ఉన్నప్పటికి విద్యాశాఖ అధికారులు ఆ నిబంధనలను పక్కన పెట్టి దూర ప్రాంతంలో ఉన్న ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడం సమంజసం కాదంటూ పీఆర్‌టీయూ నేతలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఈ సర్దుబాటు వ్యవహారం విద్యాశాఖలో చర్చకు తావిస్తోంది.

అక్రమ డిప్యూటేషన్‌లను రద్దు చేయాలి : పీఆర్‌టీయూ నేతలు

వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరిట నిబంధనలకు విరుద్ధంగా చేసిన అక్రమ డిప్యూటేషన్‌లను వెంటనే రద్దు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరేంద్రబాబు, రమణారావులు కోరారు. విద్యాశాఖ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా డిప్యూటేషన్‌లు చేయడం సమంజసం కాదన్నారు. ఉద్దేశ పూర్వకంగా దూర ప్రాంతంలో ఉన్న ఉపాధ్యాయులను వారికి అనుకూలమైన పాఠశాలల్లో డిప్యూటేషన్‌లు చేస్తూ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారని అన్నారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని తాము జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని అలాగే విద్యాశాఖ కమిషనర్‌కు , డైరెక్టర్‌లకు కూడా ఫిర్యాదు చేశామన్నారు.

నిబంధనలకు అనుగుణంగానే..

ఉపాధ్యాయుల సర్దుబాటు వ్యవహారం విద్యాశాఖ నిబంధనల మేరకే చేపడతాం. ఇటీవలే బదిలీ అయిన టీచర్లను రిలీవ్ చేసే విషయంలో నిబంధనల ప్రకారమే వ్యవహరిస్తున్నాం. వర్క్ అడ్జస్ట్‌మెంట్ డిప్యూటేషన్ విషయంలో కూడా తప్పక నిబంధనలు పాటిస్తాం. ఆరోపణలకు తావు లేకుండా ఈ ప్రక్రియను పూర్తి చేస్తాం. ఉపాధ్యాయ సంఘాలు సహకరించాలి.

- డాక్టర్ రవీందర్ రెడ్డి, డీఈవో, నిర్మల్

ప్రభుత్వ పథకాల్లో దళారులను నమ్మవద్దు

- అర్హులైన వారికే ప్రభుత్వ పథకాలు అందుతాయి
- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు


సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు

ఖానాపూర్, ఆగస్టు 6 : ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తు చేసుకునేటప్పుడు ఎటువంటి దళారులను నమ్మి మోసపోవద్దని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. మంగళవారం ఖానాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావుతో కలిసి ఎమ్మెల్యే బొజ్జు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తమ ప్రభుత్వంలో అర్హులైన వారికే ప్రభుత్వ పథకాలు అందుతా యన్నారు. అర్హత కలిగిన వారు దళారులను ఆశ్రయించకుండా నేరుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో ప్రజాపాలన సాగుతోందని ప్రభుత్వానికి ప్రజలకు మధ్యన ఎటువంటి దళారులకు తావివ్వబోమన్నారు. అనంతరం ఇటీవల ఏఈఈ ఫలితాలలో ప్రతిభ కనబరిచి ఉద్యోగం సాధించిన పద్మావతినగర్ కాలనీకి చెందిన లక్కవత్తుల శంకర్ కుమారుడు ఆద్రీస్‌ను ఎమ్మెల్యే అభినందించారు. శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్యం, వైస్ చైర్మన్ సంతోష్, పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప సత్యనారాయణ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జన్నారపు శంకర్, షబ్బీర్ పాషా, తదితరులున్నారు.

నాగమ్మ ఆలయానికి రెండు రోజుల్లో అనుమతులు ఇప్పిస్తా

మామడ రూరల్ : మండలంలని పొన్కల్ గోదావరి నదిపై నిర్మిస్తున్న సదర్మాట్ మినీబ్యారేజీని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావుతో కలిసి సందర్శించారు. ఈ నెలలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాజెక్టు ప్రారంభానికి వస్తున్న సందర్భంగా ప్రాజెక్టులో జరిగే పనులను, హెలీప్యాడ్ సభ స్థలాన్ని పరిశీలించారు. మిగిలిన పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. గోదావరి ఒడ్డున ఉన్న నాగమ్మ ఆలయం ముప్పునకు గురవ్వడానికి ఉండడంతో గ్రామస్తుల కోరిక మేరకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు నాగమ్మ ఆలయ నూతన నిర్మాణానికి రెండురోజుల్లో ప్రభుత్వ అనుమతులు ఇప్పిస్తానని పొన్కల్ గ్రామస్థులకు మాట ఇచ్చారు. రైతులకు ఏ కష్టం రాకుండా ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు రేవంత్‌రెడ్డి ఆదేశాలు అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం, ఎంపీటీసీ పడాల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, రైతు సమితి మండల అధ్యక్షుడు గంగారెడ్డి, ఖానాపూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దయానంద్, నాయకులు నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడెల్లి మహాపోచమ్మను దర్శించుకున్న కోర్టు పీపీ


కోర్టు పీపీని శాలువాతో సన్మానిస్తున్న ఆలయ సిబ్బంది

సారంగాపూర్ రూరల్, ఆగస్టు 6 : మండలంలో గల అడెల్లి మహాపోచమ్మ ఆలయంలో మంగళవారం జిల్లా కోర్టు పీపీ సతీష్ మొక్కులను మొక్కారు. ఈ నేపథ్యంలో ఆలయ పూజారి శ్రీనివాస్ అమ్మవారికి హారతినిచ్చి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ సిబ్బంది ఆయనను శాలువాతో సన్మానించారు. ఈయన వెంట ఎస్సై శ్రీకాంత్‌తో పాటు ఆలయ నిర్మాణం కాంట్రాక్టర్ జగన్మోహన్ రెడ్డి, ఆలయ సిబ్బందులు ఉన్నారు.

బాసర ఆలయ ఉద్యోగుల బదిలీ

- నలుగురికి స్థానచలనం
- ఇతర దేవాలయాల నుంచి బాసరకు ఐదుగురు ఉద్యోగులు

బాసర, ఆగస్టు 6 : దీర్ఘకాలం తర్వాత బాసర సరస్వతీ ఆలయంలో ఉద్యోగుల బదిలీలు జరిగాయి. దేవాదాయశాఖ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో చాలా కాలంగా పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీలు చేపట్టింది. ఇందులో భాగంగా బాసర గుడిలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న నలుగురు ఉద్యోగులు బదిలీ అయ్యారు సోమవారం రాత్రి ఈ మేరకు ఉత్తర్వులు రాగా ఉద్యోగులందరూ మంగళవారం కొత్త స్థానాలకు రిలీవ్ అయ్యారు. బాసర ఆలయ సూపరిండెంట్ సంజీవ్‌రావు సీనియర్ అసిస్టెంట్ విలాస్, జూనియర్ అసిస్టెంట్ పద్మ, వేములవాడ రాజరాజేశ్వర దేవస్థానానికి బదిలీ కాగా, బాసరలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ గోపాల్ సింగ్ యాదాద్రి లక్ష్మీ నర్సింహాస్వామి దేవస్థానానికి బదిలీ అయ్యారు.

దేవాదాయ శాఖ చేపట్టిన భారీ బదిలీల్లో ఐదుగురు బాసర ఆలయానికి రానున్నారు. వేములవాడ దేవస్థానం నుంచి జే. లక్ష్మణ్‌రావు (సూపరింటెండెంట్), సీహెచ్ రాజేశ్వర్‌రావు (సీనియర్ అసిస్టెంట్), సిహెచ్ శ్రీనివాస్ (జూనియర్ అసిస్టెంట్), భద్రాచలం దేవస్థానం నుండి కే. రామారావు (సీనియర్ అసిస్టెంట్), యాదాద్రి నుంచి నరేష్ (జూనియర్ అసిస్టెంట్) బాసరకు బదిలీ అయ్యారు. వీరందరూ బుధవారం పదవుల్లో చేరే అవకాశం ఉంది.

ఆంధ్రా వెళ్లే ప్రయాణికులకు ఆకర్షణీయ బహుమతులు

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 6 : ఆర్టీసీ బస్సుల్లో ఆంధ్రా వెళ్లే ప్రయాణికులకు ఆకర్షణీయ బహుమతులు అందజేయనున్నట్లు ఆర్ఎం సోలమన్ తెలిపారు. శ్రావణ మాసం సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంగళవారం నిర్మల్ బస్టాండ్‌లో ప్రకటించారు. ప్రయాణికులు తమ టికెట్ వెనుక పేరు, ఫోన్ నెంబర్ రాసి బస్సు దిగే ముందు అందులో ఏర్పాటు చేసిన బాక్స్‌లో వేయాలన్నారు. ఆన్‌లైన్ బుక్ చేసుకున్న వారు ఓ చీటిపై నెంబర్ రాసి వేయాలన్నారు. వింజమూరు, ఉదయగిరి, పామూరు, కందుకూరు, కనిగిరి, పొదిలి, మార్కాపురం, దర్శి వెళ్లే ప్రయాణికులకు ఈ బహుమతి అందజేస్తామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి ఆదరించాలని కోరారు. డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గడ్డెన్నవాగు ప్రాజెక్టులో దూకి యువకుడి ఆత్మహత్య


ఇమ్రాన్ మృతదేహం

భైంసా, ఆగస్టు 6 : పట్టణ పరిధిలోని గడ్డెన్న వాగు ప్రాజెక్టులో సోమవారం రాత్రి ఓ యువకుడు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టౌన్ ఎస్ఐ గౌష్ పాషా తెలిపిన వివరాల మేరకు స్థానిక కుంట ఏరియాకు చెందిన ఇమ్రాన్ (26) తనకు పెళ్లి చేయాలంటూ తరుచు ఇంట్లో కుటుంబీకులతో గొడవపడేవాడు. ఈ క్రమంలోనే పెళ్లి కాకపోవడంతో తీవ్ర మనస్థాపంతో కాలం గడుపుతున్నాడు. ఇందులో భాగంగానే పెళ్లి విషయంలో తీవ్ర కలతతోనున్న ఇమ్రాన్ సోమవారం సాయంత్రం తన స్నేహితుడు షేక్ షకీల్‌తో కలిసి గడ్డెన్న ప్రాజెక్టు వద్దకు వెళ్లాడు. అక్కడికి వెళ్లిన అనంతరం ఇమ్రాన్ ఒక్క సారిగా ప్రాజెక్టులో దూకగా స్నేహితుడు కాపాడే ప్రయత్నం చేసిన ఫలితం లేకుండా పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం ప్రాజెక్టులో గాలింపు చర్యలు చేపట్టి ఇమ్రాన్ మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు మొహ్మద్ ఇర్ఫాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు టౌన్ ఎస్ఐ గౌస్ పాషా తెలిపారు.

'ఎంఈవో స్వంత నిర్ణయం సరికాదు'

కుంటాల, ఆగస్టు, 6: కుంటాల మండలంలోని ఓలా ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుని రిలీవ్ చేసే విషయంలో ఎంఈవో స్వంత నిర్ణయం తీసుకొని రిలీవ్ చేయడం పట్ల పాఠశాల మూతపడే అవకాశం ఉందని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు అంబకంటి సతీష్ కుమార్ అన్నారు. కుంటాల మండలం ఓలా గ్రామంలో ఓలా ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలలో ఒకే ఒక్క ఎస్జీటీ ఉపాధ్యాయుడు పనిచేస్తున్నాడు. ఇతనికి ఇటీవల నిర్మల్ బదిలీ అయింది. ప్రభుత్వం నిబంధనల ప్రకారం (జీవో 25) ఇతని స్థానంలో వేరే ఉపాధ్యాయుడు వచ్చే వరకు ఇతనని రిలీవ్ చేయవద్దు కాని ఎంఈవో తన స్వంత నిర్ణయంతో ఉపాధ్యాయుని రిలీవ్ చేశారు. ఈ పాఠశాలలో 60 మంది విద్యార్థులు ఉన్నారు. ఉపాధ్యాయుని రిలీవ్ చేయడంతో విద్యార్థుల పరిస్థితి ఏంటని ఇప్పటికైనా ఉపాధ్యాయుని రిలీవ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం దరఖాస్తుల పరిశీలన

- నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి : కలెక్టర్ అభిలాష అభినవ్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్


హాజరైన అధికారులు

నిర్మల్ అర్బన్, ఆగస్టు 6 : లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం దరఖాస్తుల పరిశీలన నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమా వేశ మందిరంలో మున్సిపాలిటీల అభివృద్ధి, వివిధ అంశాల పురోగతిపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీలలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సి పాలిటీల వారీగా సంబంధిత వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. లక్ష్యాలను నిర్ణయించుకొని, అధికారులు బృందాలుగా ఏర్పడి దరఖాస్తుల పరిశీలనను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే దరఖాస్తులను తదుపరి దశకు పంపాలన్నారు. దరఖాస్తుల పరిశీలన అత్యంత పారదర్శకంగా ఉండాలన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు నాటిన మొక్కలకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. పట్టణాల్లో రోడ్లపై ఏర్పడిన గుంతలను గుర్తించి వాటిని పూడ్చి వేయాలని తెలిపారు. పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఫాగింగ్, ఆయిల్ బాల్స్, దోమ నియంత్రణ రసాయనాల పిచికారి, డ్రై డే కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలన్నారు. పట్టణాల అభివృద్ధికి అధికారులు ప్రత్యేక కార్యాచరణను రూపొందించుకొని సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్లు రాజు, రాజేష్‌కుమార్, మనోహర్‌లు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంలో

ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలి

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



ర్యాలీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ అర్బన్, ఆగస్టు 6 : స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సోమవార్‌పేట్ బాలికల ఉన్నత పాఠశాల నుంచి నాయిడివాడ, గాంధీ చౌక్ వీధుల గుండా విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి స్వచ్ఛదనం - పచ్చదనం ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ర్యాలీ మార్గమధ్యలో ప్రజలు, వివిధ వ్యాపారస్తులతో మాట్లాడుతూ... 120 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ కవర్లను వాడకూడదని సూచించారు. తమ చుట్టూ పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనాలలో డంపింగ్ యార్డ్‌కు తరలించాలన్నారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగం వల్ల కలిగే నష్టాలను వ్యాపారస్తులకు అదనపు కలెక్టర్ వివరించారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో ప్రొఫెసర్ జయశంకర్ కృషిని విద్యార్థులకు వివరించారు. అనంతరం స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ఆగస్టు 5 నుంచి 9వ తేదీ వరకు పరిసరాల పరిశుభ్రత, నీటి వనరుల నిర్వహణ, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పచ్చదనం, పరిశుభ్రత పెంచుటయే ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ప్రతి ఒక్కరూ పచ్చదనం పెంచేందుకు మొక్కలు నాటి ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలన్నారు. ప్రజలంతా వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూనే తమ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చునన్నారు. అనంతరం కస్బా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు కలిసి మొక్కలు నాటారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత కూడా అందరిపై ఉందన్నారు. నాటిన మొక్కలకు రక్షణ కంచెను ఏర్పాటు చేసి సంరక్షించాలన్నారు. అనంతరం స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీలలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అదనపు కలెక్టర్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో రవీందర్ రెడ్డి, మెప్మా పీడీ సుభాష్, ఎంఈవో శంకర్, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థుల మానవహారం

లక్ష్మణచాంద, ఆగస్టు 6 : స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, కళాశాల విద్యార్థులు నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛదనం - పచ్చదనం యొక్క ప్రాధాన్యత తెలిసేలా నినాదాలు చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మానవహార ప్రదర్శన చేశారు. అలాగే స్థానిక ఎంపీడీవో, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను పలువురికి తెలిసేలా చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ ఉమ్మడి జిల్లా వైస్‌చైర్మన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి తదితరులున్నారు.

సంక్షిప్త సమాచారం

మద్యానికి బానిసై ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య


సుభాష్ మృతదేహం

భైంసా రూరల్, ఆగస్టు 6 : మండలంలోని దేగాం గ్రామంలో మంగళవారం జి. సుభాష్ అనే యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దేగాం గ్రామానికి చెందిన సుభాష్ (35) మద్యానికి బానిసై గ్రామ సమీపంలో ఉన్న అల్లనేరేడు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య నాగమణి పిటిషన్ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విద్యాప్రమాణాలు పెంపొందించాలి

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 6 : విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించాలని నోడల్ అధికారి తోడిశెట్టి పరమేశ్వర్ ఉపాధ్యాయులను కోరారు. మంగళవారం సోన్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణ ముగింపు సందర్భంగా మాట్లాడుతూ... విద్యా విషయక జాతీయ సర్వే సమర్థవంతంగా నిర్వహించేందుకు ఉపాధ్యాయులు తమ పుస్తకాలు, విద్యార్థుల కనీస సామర్థ్యాలు, అభ్యాసన ఫలితాలపై సరైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆకర్షణీయ బోధనతో ప్రమాణాలు పెంపొందుతాయన్నారు. ప్రధానోపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్లు విలాస్, శిరీష్‌కుమార్, రాందాస్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

సీడీపీవోపై చర్య తీసుకోవాలని నిరసన

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 6 : ఖానాపూర్ ఐసీడీఎస్ సీడీపీవోపై చర్య తీసుకోవాలని కోరుతూ మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ప్రజా సంఘాలు రెండో రోజు నిరసన వ్యక్తం చేశాయి. ఆమె అవినీతిపై రెండు రోజులుగా పోరాటం చేస్తున్నా సరైన విచారణ చేయడం లేదన్నారు. ఆమె వేరే మహిళపై అపనిందలు చేయడం వ్యతిరేకించారు. వెంటనే చర్యకు డిమాండ్ చేశారు. నాయకులు నూతన్ కుమార్, డి. తిరుపతి, తొడసరం శంభు, సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



నిర్మల్ కల్చరల్, ఆగస్టు 6 : ప్రజలు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని చైర్మన్ ఈశ్వర్ పిలుపునిచ్చారు. మంగళవారం స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా 33 వార్డు భాగ్యనగర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిష్ఠాత్మకంగా స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆశావర్కర్లు, మున్సిపల్ సిబ్బంది, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.



పాత నేరస్తులకు సీఐ కౌన్సిలింగ్

ఇంద్రవెల్లి, ఆగస్టు 6: పాత నేరస్తులు నేరచరిత్ర విడనాడాలని ఉట్నూర్ సీఐ మొగిలి హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో పాత నేరస్థులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత నేరస్తులు ఎటువంటి నేరాలకు పాల్పడకుండా జీవనం సాగించాలని సూచించారు. వారి కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా పెడతామని నేరాలకు పాల్పడితే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దుబ్బాక సునీల్ తదితరులున్నారు.



ఎడ్లబండిపైనే ఆగిన రైతు గుండె

● పచ్చని పంట పొలాల్లో రైతు హఠాన్మరణం

తలమడుగు, ఆగస్టు 6 : ఎడ్లబండిపైనే రైతు గుండె ఆగిన విషాద ఘటన ఆదిలాబాద్ జిల్లాలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని తలమడుగు మండలం రుయ్యాడి గ్రామానికి చెందిన గోక సంజీవ్‌రెడ్డి (48) అనే రైతుకు వ్యవసాయమే జీవనాధారం. రోజూలాగే మంగళవారం కూడా వ్యవసాయ పనుల నిమిత్తం తన ఎడ్లబండిపై పొలానికి వెళ్లాడు. పచ్చటి పంట పొలాల్లో.. ఎడ్లబండిపై ఉండగానే.. గుండె నొప్పి వచ్చి సంజీవ్‌రెడ్డి తుది శ్వాస విడిచాడు.


ఎడ్లబండిపైనే మృతి చెందిన సంజీవ్‌రెడ్డి

ఘనంగా ఆచార్య జయశంకర్ జయంతి


మాట్లాడుతున్న మాజీ మంత్రి ఐకే రెడ్డి

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 6: నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మాజీమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, మున్సిపల్ ఛైర్మన్ వేరు వేరుగా జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని ఎంతో మందికి చాటిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. పేద, బడుగు వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించారన్నారు. డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరి రావు మాటాడుతూ... తెలంగాణ రాష్ట్రాన్ని సాకారం చేయాలని కలలుకన్న వ్యక్తి అని అన్నారు. స్వరాష్ట్రం కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడని అన్నారు. మున్సిపల్ ఛైర్మన్ ఈశ్వర్ మాట్లాడుతూ... మలి దశ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత జయశంకర్ అని అన్నారు.

● పోలీసు కార్యాలయంలో జయశంకర్ జయంతి

జిల్లా పోలీసు కార్యాలయంలో ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఎస్పీ జానకి షర్మిల ఆదేశం మేరకు జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఏవో యూనుస్ అలీ, ఎస్బీ ఇన్స్‌పెక్టర్ అశోక్, ఆర్ఐలు రాంని రంజన్, శేఖర్, రమేష్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

● నివాళులర్పించిన విశ్వకర్మ సంఘం

ఆచార్య జయశంకర్ 90వ జయంతి సందర్భంగా విశ్వకర్మ మాతృ సంఘం మంగళవారం నిర్మల్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఆకోజి కిషన్, కత్రోజ్ అశోక్, మధుసూదనాచారి, రామోజీ నారాయణ, రామతీర్థం, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ కల్చరల్: ఆచార్య జయశంకర్ అహర్నిశలు బడుగు, బలహీన వర్గాల కోసం శ్రమించారని, ఆయన సేవలు మరువలేనివని అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీఆర్‌వో భుజంగరావు, అధికారులు పాల్గొని నివాళులర్పించారు.

పెంబి: తెలంగాణ మలి దశ ఉద్యమంలో ప్రజలను చైతన్యం చేసిన వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సల్ల నరేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం జయశంకర్ జయంతిని పురస్కరించుకొని మండల విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులతో బస్టాండ్ సమీపంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షులు పుప్పాల నర్సయ్య, విశ్వబ్రాహ్మణ సభ్యులు లక్ష్మీనారాయణ, మోహన్, నారాయణ, పి. నరేందర్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ చారి, తదితరులున్నారు.

దిలావర్‌పూర్: తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ సేవలు మరువలేనివని మండల ప్రత్యేక అధికారి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో రమేష్ అన్నారు. మంగళవారం దిలావర్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, గ్రామ పంచా యతీ కార్యదర్శి ఆశా కార్యకర్తలు, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుంటాల: మండల కేంద్రం కుంటాల స్థానిక శాంతినికేతన్ పాఠశాలలో తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మలిదశ తెలంగాణ ఉద్యమానికి దిక్సూచిగా నిలిచి తెలంగాణ ప్రజల గుండెల్లో ఉద్యమకారుడిగా నిలిచాడని డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు.






















వర్షాకాలంలోనూ ఆగని ఇసుక అక్రమ దందా

● పెన్‌గంగా భవన్ సమీపంలో భారీగా డంపులు ● 'మామూలు'గానే తీసుకుంటున్న సంబంధిత మైనింగ్ అధికారులు

ఆదిలాబాద్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కాలమేదైనా ఇసుక అక్రమ దందా ఆగడమే లేదు. వర్షాకాలంలో ఇసుకకు భారీ డిమాండ్ ఉండడంతో అడ్డదారుల్లో అక్రమంగా ఇసుకను తరలిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. వర్షాకాల పరిస్థితులను ముందే పసిగట్టిన ఇసుక మాఫియా పెన్‌గంగా నది పరిసర ప్రాంతాలలో భారీగా డంపులను ఏర్పాటు చేసుకొని రాత్రికి రాత్రే జిల్లా కేంద్రానికి తరలిస్తూ అమ్మేసుకుంటున్నారు. జిల్లాకేంద్రం నడిబొడ్డున ఉన్న పెన్‌గంగా భవన్ సమీపంలో భారీగా ఇసుక డంపులను నిల్వ చేస్తున్న అడిగే వారే కరువవుతున్నారు. ప్రస్తుతం పెన్‌గంగా నదిలోనూ పెద్దగా వరద ప్రవాహం లేకపోవడంతో ఇసుక మాఫియా ఇసుక అక్రమ తవ్వకాలను చేపడుతూ యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఇదంతా మైనింగ్ అధికారులకు తెలిసినా తెలియనట్లుగానే వ్యవహరిస్తున్నారు. నెలనెలా అధికారులకు మామూళ్లను ముట్టచెప్పడంతో మౌనంగానే ఉండిపోతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇసుక మాఫియా ఆగడాలకు పెన్‌గంగా పరిసర ప్రాంతాల్లోని గ్రామీణ రోడ్లనీ పూర్తిగా ధ్వంసమైపోయి కనిపిస్తున్నాయి. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో రోడ్లపై భారీ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారుతున్నాయని చెబుతున్నారు. ఇప్పటికే పలుమార్లు మైనింగ్ శాఖాధికారులకు పిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని స్థానిక గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.



ఆదిలాబాద్‌లో జిల్లాకేంద్రంలోని పెన్‌గంగా భవన్ సమీపంలో నిల్వ చేసిన ఇసుక డంపులు



ఇంద్రవెల్లిలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

పాట ఉన్నంత వరకు ప్రజల హృదయాల్లో గద్దర్ : సోన్‌కాంబ్లే

ఇంద్రవెల్లి, ఆగస్టు 6: పాట ఉన్నంత వరకు గద్దర్ ప్రజల హృదయాల్లో ఉంటారని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్ కాంబ్లే మనోహర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ భవనంలో గద్దర్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా యుద్ధనౌక గద్దర్ ఎప్పటికీ ప్రజలకు గుర్తుంటారన్నారు. ఆట, పాటల ద్వారా ప్రజలను చైతన్యం చేసిన గద్దర్‌ను మించిన కళాకారులు మరొకరు లేరన్నారు. తన జీవితాంతం పేదల అభ్యున్నతి కోసం పని చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వాగ్మార్ కామరాజ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు మిర్జా జిలానీ బేగ్ మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షులు కాంబ్లే సతీష్, భీం ఆర్మీ మండల అధ్యక్షుడు సూర్యవంశీ, ఉత్తం, నాయకులు, తదితరులు ఉన్నారు.

ఉట్నూర్: ప్రజాయుద్ధ నౌక గద్దర్ మొదటి వర్ధంతిని దళిత గిరిజన నాయకులు ఘనంగా నిర్వహించారు. ఉట్నూర్ మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక అంశాలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజా చైతన్యాన్ని నింపిన గద్దర్ పేరిట ప్రభుత్వం అవార్డు ప్రకటించాలని నాయకులు కోరారు. ఇదిలా ఉండగా తెలంగాణ స్మారక స్తూపం వద్ద ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని నిర్వహించారు. ఇందులో మాల సంఘ అధ్యక్షులు బొంకంటి సుభాష్, బండి విజయ్, రాథోడ్ అన్వేష్, కాంబ్లె ప్రజ్ఞశీల్, సుశీల్, గొడిపెల్లి రాజ్‌కుమార్, స్వామి దాస్, ఆనంద్ బాబు, మాల, అనుబంధ సంఘాల జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

బోథ్: సోనాలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి, ప్రజాయుద్ధ నౌక గద్దర్ వర్ధంతి కార్యక్రమాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిత్ర పటాలకు పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం చేసిన పోరాట పటిమను గుర్తుచేశారు. ఈ సందర్భంగా పూణే వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గాజుల పోతన్న మాట్లాడుతూ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం వ్యూహకర్తగా పని చేయగా గద్దర్ తన ఆట, పాటలతో ప్రజలను చైతన్యం చేశారన్నారు. తెలంగాణ ప్రజలు దోపిడీకి గురవుతున్న తీరును ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కూలీ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి బత్తుల రమేష్ మాట్లాడారు. ఇందులోసొసైటీ కార్యదర్శి అమృతరావు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు. అలాగే సోనాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయులు జయశంకర్ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం కృషి చేశారన్నారు.



సోనాలలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి, గద్దర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

● కేస్లాపూర్‌లో 'స్వచ్ఛదనం,పచ్చదనం' కార్యక్రమాలను పరిశీలించిన జడ్పీ సీఈవో

ఇంద్రవెల్లి, ఆగస్టు 6: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాల్లో గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా మార్చాలని జడ్పీ సీఈవో కళిందిని అన్నారు. మంగళవారం మండలంలోని కేస్లాపూర్ గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని పరిశీలించారు. గ్రామాల్లో కొనసాగుతున్న పారిశుధ్య పనులు, వన మహోత్సవంలో మొక్కలు నాటే కార్యక్రమం వివరాలను తెలుసుకున్నారు. స్వయంగా దగ్గరుండి మంచినీటి పథకాల్లో క్లోరింగ్ చేయించారు. అంగన్‌వాడీ ప్రాథమిక, ఆశ్రమ బాలికల పాఠశాలలను సందర్శించి పరిసరాలను పరిశీలించారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించి, ఆ సమస్యలను పరిష్కరించి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. అదేవిధంగా పచ్చదనంలో భాగంగా నిర్వహిస్తున్న వన మహోత్సవం కార్యక్రమంలో గ్రామాల వారీగా మొక్కలు నాటే లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, ఎంపీవో సమీరా, అహ్మద్, టెక్నికల్ అసిస్టెంట్ జాదవ్, ,విఠల్, మాజీ సర్పంచ్ మెస్రం రేణుక నాగనాథ్, గ్రామస్థులున్నారు.

ఉట్నూర్: జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి కళిందిని మంగళవారం ఉట్నూర్ మండలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి పచ్చదనం స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి పురస్కరించుకొని జయశంకర్ చిత్రపటానికి సీఈవో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. అనంతరం తాండ్ర గ్రామ పంచాయతీ సందర్శించి మొక్కలు నాటారు. ఇందులో ఎంపీడీవో రాంప్రసాద్, మండల పంచాయతీ అధికారి మహేశ్ కుమార్, సూపరింటెండెంట్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఏపీవో ఈజీఎస్ రజనీకాంత్, కార్యదర్శి ప్రతాప్‌సింగ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కేస్లాపూర్‌లో క్లోరినేషన్ పనులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో

'స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతాం'

ఆదిలాబాద్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటుతామని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం బేల మండలంలోని మసాల(బి) గ్రామంలో చేరికల కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. త్వరలోనే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు రానున్నాయని కార్యకర్తలు కలిసి కట్టుగా పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పని చేయాలన్నారు. గ్రామ గ్రామాన కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలన్నారు. తాజా మాజీ వైస్ ఎంపీపీ బండిసుజాత ఆధ్వర్యంలో మసాల(బి), ఏకోరి, ఏటి, బాది, తెలంగ్‌రావ్‌గూడ, తలాయిగూడ, మోహన్‌రావ్‌గూడ, పాలాయితండా గ్రామాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు, బీఆర్ఎస్ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇందులో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, గిమ్మ సంతోష్, ఫైజుల్లాఖాన్, తదితరులున్నారు.



కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న కంది శ్రీనివాస్‌రెడ్డి



కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

పథకాల కోసం ఎవరికీ డబ్బులివ్వొద్దు : పాయల

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 6: ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మంగళవారం పట్టణంలోని 170 కాలనీ, ఆదిత్యనగర్ శివారు కాలనీలు సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సరైన రహదారులు, మురికి కాలువ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి ప్రజలు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమృత పథకం కింద పట్టణాభివృద్ధికినిధులు కేటాయించినట్లు రాష్ట్ర ప్రభుత్వం తగు విధంగా నిధులు ఇవ్వాలని కోరారు. అనంతరం ఆదిలాబాద్ మున్సిపాలిటీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో 75 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో సొంత ఇల్లు లేని నిరుపేదలు ఎందరో ఉన్నారని, వారికి ప్లాట్లు, ఇళ్ల నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఇస్తున్న సాయం బాధితులకు ఎటూ సరిపోదన్నారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, కౌన్సిలర్‌లు పవన్ నాయక్, బండారి సతీష్, బీజేపీ కౌన్సిలర్ ఆకుల ప్రవీణ్, కృష్ణ యాదవ్ పాల్గొన్నారు.



అడేగామ(కె) అంతర్‌రాష్ట్ర రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

చెరువు కుడి కాల్వ నిర్మాణం చేపట్టాలి

ఇచ్చోడ, ఆగస్టు, 6: మండలంలోని అడేగామ(కె) గ్రామ చెరువు నిర్మాణం 2007లో చేపట్టినప్పటి నుంచి కుడి కాల్వ నిర్మాణం చేపట్టలేదని రైతులు ధర్నాకు దిగి రాస్తారోకో చేశారు. చెరువు పరిధిలోని అడేగామ(కె), అడేగామ(బి), కోకస్‌మన్నూర్ మూడు గ్రామాలకు దాదాపు వెయ్యి ఎకరాలకు నీటి లభ్యత ఏర్పడుతుందని, ఇట్టి కాలువకు తక్షణమే నిర్మాణం చేపట్టాలని ధర్నా నిర్వహించి రాస్తారోకో చేపట్టారు. పోలీసులు వచ్చి రైతులను సముదాయించడంతో రైతులు ఆందోళన విరమించారు. అలాగే గ్రామంలోని రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని రహదారిని బాగు చేయాలని కోరారు. ఇందులో రైతులు బద్దం లక్షారెడ్డి, భోజన్న, వామన్‌రెడ్డి, కళ్లెం జీవన్‌డ్డి, మల్లేశ్వర్‌రెడ్డి, రాంచందర్‌రెడ్డి, రవీందర్‌సింగ్ గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సుష్మాస్వరాజ్‌కు ఘన నివాళి

ఉట్నూర్, ఆగస్టు 6: మంగళవారం దివంగత కేంద్ర మంత్రి సుష్మాస్వరాజ్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఓబీసీ జిల్లా కార్యదర్శి కొండెరి రమేష్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రం నుంచి విడిపోవడానికి తెలంగాణ ప్రజలు చేసిన పోరాటాలు, ఉద్యమాలను సమర్థిస్తూ కేంద్రంలో తనవాణిని వినిపించిన మహనీయురాలు సుష్మాస్వరాజ్ అని అన్నారు. ఇందులో నాయకులు శేషారావు, నాయకులు కాలువ రవి, పోషన్న, ఉస్మేమోళ్ల దేవిదాస్, రాథోడ్ విఠల్, పులి శ్రీకాంత్, మహేందర్, తరుణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.


తెలంగాణ ఉద్యమానికి ఊపిరులూదిన గద్దర్



గద్దర్ వర్ధంతిలో పాల్గొన్న నాయకులు

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 6 : ప్రజా యుద్ధ నౌక స్వర్గీయ గద్దర్ తెలంగాణ ఉద్యమానికి ఊపిరులూదారని డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు అన్నారు. నిర్మల్ టీఎన్జీవో భవనంలో మంగళవారం గద్దర్ ప్రథమ వర్ధంతి నిర్వహించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి ఆయన గద్దర్‌కు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమ పునరుద్ధరణలో వెనుకబడిన కులాలు, నిమ్న కులాల ఉద్ధరణకు ప్రత్యేక రాష్ట్రం కోసం మద్దతు తెలిపాడన్నారు. తన పాటలతో ఉద్యమానికి ఊపిరి పోశారన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు ప్రత్యేక అభిమానాన్ని చూపారన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్రం సుగుణ, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, ఖానాపూర్ చైర్మన్ రాజుర సత్యం, వెంకట స్వామి, రత్నం, నాందేడపు చిన్ను, గణేష్, బురాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో బాలుడికి కృత్రిమ కాలు



కృత్రిమ కాలును అమర్చుతున్న దృశ్యం

దస్తురాబాద్ రూరల్, ఆగస్టు 6 : మండల కేంద్రానికి చెందిన సిందం నాగచైతన్య అనే బాలుడికి గతంలో విద్యుత్ షాక్ తగిలి కాలును పూర్తిగా కోల్పోయాడు. గతంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఖానాపూర్ వెళ్తున్న క్రమంలో తన వాహనాన్ని ఆపి ఆటోలో ఉన్న బాలుడిని పరామర్శించారు. ప్రమాదానికి గల వివరాలను అడిగి తెలుసుకొని అతనికి కృత్రిమ కాలు అమరుస్తానని మాటిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిద్రాల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అనిల్ చిద్రాలను సంప్రదించి, మంగళవారం నాగచైతన్యకు భద్రాద్రి కొత్తగూడెంలో కృత్రిమ కాలు అమర్చి మాటను నిలబెట్టుకున్నారు. ఈ సందర్భంగా నాగచైతన్య కుటుంబీకులు ఆపదలో ఉన్న తమ బాటు ఆరోగ్య పరిస్థితిని గుర్తించి సమస్యను తీర్చిదినందుకు వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండా

● ముథోల్ ఎమ్మెల్యే రాంరావు పటేల్

బాసర, ఆగస్టు, 6 : ముథోల్ నియోజకవర్గంలో ప్రజా సమస్యలే తన ప్రధాన ఎజెండా అని వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే రాంరావు పటేల్ అన్నారు. మంగళవారం బాసర మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్నికలప్పుడే రాజకీయాలని రాబోయే రోజులన్నీ ప్రజల సమస్యలను, నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానని చెప్పారు. ముఖ్యంగా విద్య, వైద్య, వ్యవసాయం మూడు రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే వెంట మండల బీజేపీ నాయకులు పోగుల రాజేశ్వర్, కిశోర్ దేశాయ్, ప్రతాప్ రావు, సాయినాథ్, తదితరులు ఉన్నారు.

రాష్ట్రసాధనలో ప్రొ.జయశంకర్ సేవలు చిరస్మరణీయం

భైంసా, ఆగస్టు 6 : ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ప్రక్రియలో ప్రొ, జయశంకర్ చేసిన సేవలు చిరస్మరణీయమని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ పెర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని జయశంకర్ కాలనీలో జరిగిన ప్రొ. కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. ప్రొ.జయశంకర్ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం సిద్ధాంతకర్తగా ,ఉద్యమ స్ఫూర్తి ప్రదాతగా ప్రణాళికబద్దమైన తీరుతో అలుపెరుగని రీతిలో అనిర్వచనీయమైన సేవలు అందించారని కొనియాడారు.ఆయన చేసిన నిరంతర కృషి, దృఢ సంకల్పంతోనే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ పోరు ఉధృతమై ఫలితం దక్కిందన్నారు. ఈ సందర్భంగా భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, వార్డు మున్సిపల్ కౌన్సిలర్ చందులాల్‌తో కలిసి ఎమ్మెల్యే రామరావ్ పాటిల్ ప్రొ. జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిముషాలు మౌనం పాటించారు. ఇందులో బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ కర్త విలాస్ గాదేవార్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షులు డా.ఎం. రామకృష్ణగౌడ్, భైంసా స్వర్ణకార సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బెజ్జంకి రవి, రంగు శ్రీనివాస్, విశ్వబ్రహ్మణ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోపాల్, డా.సాగర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామరావ్ పాటిల్, ఏఎస్పీ అవినాష్ కుమార్, వార్డు కౌన్సిలర్ చందులాల్‌లు కాలనీవాసులతో కలిసి ముమ్మరంగా మొక్కలు నాటారు.


భైంసా రూరల్ : మండలంలోని దేగాం గ్రామంలో జడ్పీఎస్ఎస్ పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విశ్వనాథ్ మాట్లాడుతూ... ప్రొఫెసర్ జయశంకర్ చేసిన సేవలను కొనియాడారు. తెలంగాణకు నీళ్లు, నిధులు, నియామకాలలో జరుగుతున్న అన్యాయాలను ఆనాడు ప్రజలకు వివరించి చైతన్యపరిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు.

ముథోల్ : మండల కేంద్రంలోని వ్యవసాయ పరిశోధన స్థానం, ఏరువాక కేంద్రం, మండల అభివృద్ధి కార్యాలయంతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో మంగళవారం ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా.విజయ్ కుమార్, డా. కార్తీక్, ఎంపీడీవో శివప్రసాద్, ఏపీవో శిరీషరెడ్డి, సిబ్బంది, ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

కుభీర్ : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో, కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో మంగళవారం తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బషీర్‌పటేల్, బంకబాబు, కందూర్ రాందాస్, విలాస్, షేక్ షెఫి, లవకుశ్, బాబు, మల్లయ్య, పుప్పాల పీరాజీ, తదితరులున్నారు.



భైంసాలో జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాంరావ్ పాటిల్



ముథోల్ వ్యవసాయ పరిశోధన స్థానంలో జయశంకర్ జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం

మత్తు పదార్థాలకు యువత బానిస కావొద్దు

కడెం మండలం చిన్న బెల్లాల్ కార్డన్ అండర్ సెర్చ్‌లో ఖానాపూర్ సీఐ సైదారావు

ఖానాపూర్, ఆగస్టు 6 : నేటి సమాజంలో యువత గంజాయి డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు బానిస కావొద్దని ఖానాపూర్ సీఐ సైదారావు అన్నారు. మంగళవారం కడెం మండలంలోని చిన్న బెల్లాల్ గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన అనుమతి పత్రాలు లేని 90 ద్విచక్ర వాహనాలు, రెండు కార్లు, మూడు ఆటోలు, ఒక ఐచర్, ఒక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని వాహనాల తనిఖీ నిర్వహించారు. అనంతరం సీఐ సైదారావు మాట్లాడుతూ... రాత్రి 10 దాటిన తర్వాత యువకులు రోడ్లపై తిరగవద్దని హెచ్చరించారు. మత్తు పదార్థాలకు బానిస కాకుండా సరైన లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదలతో వాటిని సాధించేందుకు కృషి చేయాలని యువతకు మార్గనిర్దేశం చేశారు. మత్తు పదార్థాలను ఎవరైనా అమ్మిన, కొన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రతి ఒక్క వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్‌లతో పాటు ఇన్సూరెన్స్ సైతం కలిగి ఉండాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలన్నారు. ఆన్‌లైన్ మోసాలకు గురైనట్లయితే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కి కాల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కడెం ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి, పెంబి ఎస్సై శంకర్, ఏఎస్సైలు భీంరావు, దేవ్, తితరులున్నారు.



కడెం మండలం చిన్న బెల్లాల్ గ్రామంలో మాట్లాడుతున్న సీఐ సైదారావు

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి

లక్ష్మణచాంద, ఆగస్టు 6 : సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సుమలత అన్నారు. మంగళవారం మల్లాపూర్ గ్రామంలో గల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులతో చాటింగ్ చేయరాదని, అనవసర లింకులను ఓపెన్ చేయరాదని సూచించారు. ఎలాంటి విపత్కర పరిస్థితులైనా ఎదురైనప్పుడు డయల్ 100కు గానీ 108కి గానీ, సైబర్ క్రైమ్ 1930 గానీ ఫోన్ చేయాలని పేర్కొన్నారు. ట్రాఫిక్ రూల్స్ ప్రస్తావిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగన్న, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు సమస్యలను విన్నవిస్తున్న బాసర ట్రిపుల్ ఐటీ కార్మికులు


మమ్మల్ని ఆదుకోండి

● ముథోల్ ఎమ్మెల్యేకు ట్రిపుల్ ఐటీ కార్మికుల వినతి

బాసర, ఆగస్టు, 6: పనిఎక్కువ జీతం తక్కువ ఇస్తూ తమను శ్రమ దోపిడికి గురిచేస్తున్నారని బాసర ట్రిపుల్ ఐటీ కార్మికులు మంగళవారం ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ట్రిపుల్ ఐటీ ముందునుంచి భైంసాకు వెళుతున్న ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. రోజుకు 480 రూపాయలు ఇవ్వాల్సి ఉండగా కేవలం 270 రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అది కూడా 30 రోజులు పనిదినాలకు 20 రోజులే పని కల్పిస్తున్నారని చెప్పారు. 180 మందితో చేయాల్సిన పనిని 120 మందితో పూర్తి చేయిస్తున్నారని, ప్రశ్నిస్తే ఉద్యోగం నుంచి తొలగిస్తున్నారని ఎమ్మెల్యేకు పిర్యాదు చేశారు.

andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్టం 36.8, కనిష్టం 25.2

ఆంధ్రజ్యోతి



ఆదిలాబాద్
జిల్లా వార్తలు

బుధవారం 7 ఆగస్టు 2024

'సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుకోవాలి'

ఉట్నూర్, ఆగస్టు 6: ఉమ్మడి జిల్లాలోని గిరిజనులు ఆదివాసీ సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుకొని భావితరాలకు అందించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 9న మండలకేంద్రంలోని కేబీ కాంప్లెక్స్ పీఎస్ఆర్‌సీ భవనంలో నిర్వహించే ఆదివాసీ దినోత్సవానికి రావాలని మంగళవారం నిర్వహణ కమిటీ అధ్యక్షుడు మంగం విశంరావు ఎమ్మెల్యేను కోరారు. ఆ తర్వాత ఆదివాసీ గిరిజనులతో కలిసి కరపత్రాలను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు.

జిల్లాకు.. భట్టి భరోసా!

- జిల్లాకు నేడు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రాక
- పీపుల్స్‌మార్చ్ పాదయాత్రలో ఇచ్చిన హామీలకు శ్రీకారం
- పిప్రి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన
- పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి సారించాలంటున్న రైతులు
- పిప్రి లిఫ్టిరిగేషన్ నిర్మాణ పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చే అవకాశం
- ఏర్పాట్లను పూర్తి చేసిన జిల్లా అధికార యంత్రాంగం



• జెండా ఊపి భట్టివిక్రమార్క పాదయాత్రను ప్రారంభిస్తున్న మాణిక్యరావు ఠాకూర్ (ఫైల్)

ఆదిలాబాద్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క జిల్లా పర్యటన ఖరారైంది. బుధవారం బోథ్ నియోజకవర్గం బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంఖు స్థాపనలు చేయనున్నారు. 2023 మార్చి 16న సీఎల్పీ నేత హోదాలో పిప్రి గ్రామం నుంచే పీపుల్స్ మార్చ్ పేరిట పాదయాత్రను ప్రారంభించారు. దీంతో పిప్రి గ్రామాన్ని సెంటిమెంట్‌గా భావించిన భట్టివిక్రమార్క 16 నెలల తర్వాత మళ్లీ ఉపముఖ్యమంత్రి హోదాలో తొలిసారిగా పిప్రి గ్రామానికి వస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పిప్రి గ్రామాన్ని సందర్శించేందుకు భట్టివిక్రమార్క షెడ్యూల్ రెండుసార్లు ఖరారైన అనివార్య కారణాల వలన వాయిదా పడింది. పాదయాత్రలో ప్రజల సమస్యలను దగ్గరుండి పరిశీలించిన ఉపముఖ్యమంత్రి గతంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ.. జిల్లా ప్రజలకు భరోసా కల్పించనున్నారు. జిల్లాలో ప్రారంభమైన పాదయాత్ర 700 గ్రామాల మీదుగా సుమారు వెయ్యి కి.మీల మేర కొనసాగి ఖమ్మం జిల్లా కేంద్రంలో ముగిసిన విషయం తెలిసిందే. ఈ పాదయాత్రనే రాష్ట్ర రాజకీయాలను తలకిందులు చేసిందన్న టాక్ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. గత ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ.. సాగిన భట్టి పాదయాత్ర ఇందిరమ్మ రాజ్యం, ప్రజాపాలన రావడానికి అసలు కారణమని చెప్పవచ్చు. పిప్రి గ్రామాన్ని దత్తత తీసుకునే అవకాశం ఉందని అధికార పార్టీ వర్గాల ద్వారా తెలుస్తుంది. పలు అభివృద్ధి పనులకు శంఖు స్థాపనలు చేయడంతో పాటు జిల్లాలో మరిన్ని పథకాల అమలు, మంజూరుకు హామీ ఇచ్చే అవకాశం ఉంది. తొలిసారి ఉపముఖ్యమంత్రి హోదాలో జిల్లాకు వస్తున్న భట్టివిక్రమార్క దృష్టికి జిల్లా సమస్యలను తీసుకెళ్లేందుకు స్థానిక నేతలు సిద్ధమవుతున్నారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు.

జిల్లా నుంచే గ్యారంటీలకు శ్రీకారం

ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కకు జిల్లా ప్రజలతో ప్రత్యేక అనుబంధం ఉంది. గతేడు బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామం నుంచి పీపుల్స్‌మార్చ్ పాదయాత్రను ప్రారంభించిన భట్టి ఉమ్మడి జిల్లాలోని పలు మారుమూల మండలాలు, గ్రామాల గుండా పాదయాత్ర సాగిం ది. దీంతో జిల్లా సమస్యలపై ఉప ముఖ్యమంత్రికి పూర్తి అవగాహన ఏర్పడింది. మారుమూల గ్రామాలలో ఆదివాసీ గిరిజనులు ఎదుర్కొంటు న్న సమస్యలు, కష్టాలను దగ్గరుండి పరిశీలించిన భట్టివిక్రమార్క వచ్చే ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యంలో సమస్యలను పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ముఖ్యంగా పోడుభూముల సమస్య, ఇందిరమ్మ ఇళ్లు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, రేషన్‌కార్డులు, తాగు, సాగునీటి సమస్యలపై గిరిజనులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆరు గ్యారంటీల అమలుపై ప్రత్యేకదృష్టిని సారించి అప్పట్లోనే శ్రీకారం చుట్టినట్లు తెలుస్తుంది. ఎన్నికల సమయంలో అధిష్ఠానాన్ని ఒప్పించి మరీ ఆరు గ్యారెంటీలు అమలయ్యేలా కీలకంగా వ్యవహరించారన్న టాక్ అధికార పార్టీలో వినిపిస్తోంది.



పిప్రి గ్రామంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, అధికారులు

రూ.20కోట్ల నిధులు మంజూరు

పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకునేందుకు రూ.20 కోట్ల 50లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో భాగంగానే రూ.15కోట్లతో ఎస్టీఎస్‌డీఎఫ్ నిధులతో రోడ్ల నిర్మాణం. రూ.2 కోట్లతో నేరడిగొండ మండలం వాంకిడి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం. రూ.3.5కోట్లతో పిప్రి గ్రామంలో సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అలాగే ఎస్సీ కార్పొరేషన్ కింద ఎన్నికైన లబ్దిదారులకు చెక్కుల పంపిణీ, ఐటీడీఏ, మహిళ శక్తి గ్రూపులకు బ్యాంకు లింకేజి చెక్కులను పంపిణీ చేయనున్నారు. అలాగే ఎన్నో ఏళ్లుగా దేగామా ప్రాజెక్టు ఆనకట్టు ఎత్తును పెంచాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తు వస్తున్నారు. దీంతో వెయ్యి ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ముంపు గ్రామాల ప్రజలు పరిహారం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కను కలిసి వినతిపత్రాన్ని అందించే అవకాశం ఉంది. అలాగే పిప్రి లిఫ్టిరిగేషన్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. కడెం నది పై నిర్మించే లిఫ్టిరిగేషన్ ఏర్పాటుకు ప్రత్యేక జీవోను జారీ చేసే అవకాశం ఉంది. దీంతో బజార్‌హత్నూర్ మండలంలోని 2 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుందని అధికారులు పేర్కొంటున్నారు. పలు సమస్యలపై ప్రత్యేకదృష్టిని సారించి పరిష్కార మార్గాన్ని చూపుతారని స్థానిక ప్రజలు భావిస్తున్నారు.

కుప్టి ప్రాజెక్టుకు రూ.234కోట్లు

బోథ్ నియోజకవర్గంలోని నేరడిగొండ మండలం కుప్టి వద్ద నిర్మించే ప్రాజెక్టుకు ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.234కోట్లను మంజూరు చేసింది. త్వరలోనే భూసేకరణ పనులను ప్రారంభించేందుకు సిద్ధమయ్యింది. గత రెండు మూడు రోజుల క్రితమే కలెక్టర్ ఇరిగేషన్, రెవెన్యూ శాఖలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి భూసేకరణకు అవరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. 2025 మార్చి వరకు భూసేకరణ పనులను పూర్తి చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. 5.30 టీఎంసీల నీటిసామర్థ్యంతో నిర్మించే కుప్టి ప్రాజెక్టుతో సాగు, తాగునీటితో పాటు అదనంగా 3మెగా వాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టుతో బోథ్, ఇచ్చోడ, బజార్‌హత్నూర్, నేరడిగొండ మండలాలతో పాటు నిర్మల్ జిల్లాలోని పెంబి, కడెం మండ లాలకు సాగు, తాగునీటిని అందించే అవకాశం ఉంది. అలాగే కుంటాల జలపాతానికి నిరంతరంగా నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగానే పనులను ప్రారంభించే అవకాశం ఉంది. అలాగే ఆదిలాబాద్ నియోజకవర్గంలోని కోర్టా-చనకా బ్యారేజీ నిర్మాణానికి నిధులను కేటాయిస్తే పెండింగ్ పనులను పూర్తి చేసి ఆయకట్టుకు సాగునీటిని అందించే అవకాశం ఉంటుంది. అలాగే దేగామ, చిక్‌మన్ ప్రాజెక్టుల పునరుద్ధరణకు నిధులను విడుదల చేయాలని జిల్లావాసులు కోరుతున్నారు.

డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క పర్యటన షెడ్యూల్ ఇలా..

డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క జిల్లా పర్యటన షెడ్యూల్ ఖరారైంది. బుధవారం ఉదయం 10.30 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక హెలీక్యాప్టర్‌లో బయలుదేరి 11.30గంటలకు బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామానికి చేరుకుంటారు. అక్కడే అధికారులు, ఇతర ప్రజా ప్రతినిధులతో సమావేశమవుతారు. పలు అభివృద్ధి కార్యక్రమాల కు శంకుస్థాపనలు చేసి ఎస్సీ, ఎస్టీ లబ్దిదారులు, మహిళ శక్తి సభ్యులకు బ్యాంకు లింకేజీ చెక్కులను పంపిణీ చేస్తారు. తిరిగి మధ్యాహ్నం 2.25 గంటలకు పిప్రి నుంచి హైదరాబాద్ బయలుదేరి వెళ్తారు.



ఆశ్రమ పాఠశాలలో బోరు మోటారు బిగిస్తున్న దృశ్యం

పాఠశాలలో బోరు మోటార్ బిగింపు

ఉట్నూర్, ఆగస్టు 6: ఉన్నతాధికారులు సందర్శిస్తేనే స్థానిక అధికారుల్లో చలనం వస్తుందని ఈ సంఘటన రుజువు చేస్తుంది. ఉట్నూర్ మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో గత కొన్నేళ్లుగా మంచినీటి సమస్య ఉంది. గత జూలై మాసంలో ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్త ఆకస్మికతనిఖీ సందర్భంగా మంచినీటి ఇబ్బందులు ఉన్నాయని సిబ్బంది తెలపడంతో స్పందించిన పీవో వెంటనే బోరు వేయించారు. కానీ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు బోరుకు మోటార్ వేయించడలో నిర్లక్ష్యం చేస్తూ వచ్చారు. కలెక్టర్ రాజార్షిషా, ఐటీడీఏ పీఓతో కలిసి సోమవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ నిర్వహించి బోరుకు వెంటనే మోటార్ వేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో మంగళవారం ఉదయమే ఇంజనీరింగ్ అధికారులు ఆధ్వర్యంలో బోరుకు మోటార్ బిగించడం పనులు చేపట్టారు. ఎన్ని రోజులుగా చెబుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోలేదని, కలెక్టర్ చెప్పడంతో మోటార్ బిగించారని సిబ్బంది వివరించారు.

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి : జంగు

గుడిహత్నూర్, ఆగస్టు 6: ఈనెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని మండలంలోని ప్రతీ ఆదివాసీ గూడెంలో ఆకుపచ్చ జెండా ఎగురవేసి ఘనంగా నిర్వహించుకోవాలని ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడు రాయిసిడం జంగు పటేల్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆదివాసీ సేన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రతీఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆదివాసీ మండల అధ్యక్షుడు సేడ్మకి భీంరావ్, ఆదివాసీ సేన జిల్లా ముఖ్య సలహాదారులు ఉయిక లక్ష్మణ్, రాయి సెంటర్ సార్మెడి పెందోర్ జైరాం, ఆదివాసీ రైతు సేన తోడసం భూమా పటేల్, ఆదివాసీ విద్యార్థి సేన జిల్లా కన్వీనర్ కుంరం చత్రుఘన్, ఆదివాసీ సేన నాయకులు ఉయిక శ్యాంరావు, కుంరం రాందాస్, వెడ్మ చంపత్‌రావు, పెందోర్ గోవింద్, కొట్నాక గోవింద్, మడవి జంగు, మడవి వేంకటి, పంద్ర మానిక్, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌లో ఘనంగా తుడుందెబ్బ ఆవిర్భావ దినోత్సవం

ఉట్నూర్, ఆగస్టు 6: మండల కేంద్రంలో మంగళవారం తుడుందెబ్బ ఆవిర్భావ దినోత్సవాన్ని తుడుందెబ్బ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నికైన తుడుందెబ్బ వ్యవస్థాపక సభ్యుడు దివంగత సిడాం శంభు వారసుడు సిడాం జంగుదేవ్ పటేల్‌ని తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయనకు జిల్లా అధ్యక్షుడు బాపురావు నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుడుందెబ్బ ఏర్పడి 28ఏళ్లు కావస్తోందని, తుడుందెబ్బ పోరాట ఉద్యమాలు గురించి వారు గుర్తు చేసుకున్నారు. పోడు భూములకు హక్కు పత్రాలు, 1/70 చట్టం, పేసీ చట్టాలు, అటవీ హక్కుల గుర్తింపు చట్టం 2006 వచ్చాయన్నారు. ఇందులో రాజ్‌గోండు సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పెందూరు ప్రభాకర్, మంగం విషంరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంజీగోండు ఆశయ సాధన సమితి చైర్మన్ మర్సుకోల తిరుపతి, ఆడ హనుమంత రావు, ఉట్నూర్ అధ్యక్షుడు బొంత ఆశారెడ్డి, తదితరులున్నారు.

ధన్నూర్‌లో పాఠశాలల తనిఖీ

భోథ్, ఆగస్టు 6: మండలంలోని దన్నూర్ గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో ఎంపీడీవో జీవన్‌రెడ్డి తనిఖీలు చేశారు. దీనిలో భాగంగా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పరిసరాలను పరిశీలించారు. అనంతరం శ్రమదానం నిర్వహించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఇందులో హెచ్‌ఎం రాజు, చోప్రా రావుల శంకర్, పంచాయతీ కార్యదర్శి శిరీష, ఇంద్రారెడ్డి, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ అధ్యక్షుడు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన తాగునీటిని సరఫరా చేయాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశం
- 'స్వచ్ఛదనం-పచ్చదనం'లో భాగంగా రెండో రోజున మిషన్ భగీరథ నీటి సరఫరా, పారిశుధ్య పనుల పరిశీలన
- సిరికొండ మండలం పొన్న గ్రామంలో పర్యటన
- పాల్గొన్న జిల్లా అధికారులు, స్థానిక గ్రామ పంచాయతీ సిబ్బంది

సిరికొండ, ఆగస్టు 6: వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటిని నాణ్యతతో సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు మంగళవారం స్వచ్ఛదనం-పచ్ఛదనం కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు కలెక్టర్ సిరికొండ మండలంలోని పొన్న గ్రామంలో పర్యటించారు. దీనిలో భాగంగా ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటారు. ఆ తర్వాత మిషన్ భగీరథ నీటిపై చర్చించి.. ఒక నివాస గృహంలో పరిలించారు. ఆ తర్వాత వరదలకు కోతకు గురైన రోడ్డును, కల్వర్టును పరిశీలించారు. తాగునీటి శాంపిల్స్ సేకరించి ఎక్కడికక్కడ పరీక్షలు జరిపాల్సిన అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని, సంబంధిత శాఖల అధికారులపై మండిపడ్డారు. ముందుగా గ్రామంలోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు వద్దకు చేరుకుని తాగునీటిని పరిక్షించి ప్రతీరోజు తాగునీటి సరఫరా గురించి అధికారులను, గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల స్థాయి అధికారులు, గ్రామస్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. పొన్న గ్రామంలోని పలు వీధుల గుండా తిరుగుతూ రోడ్లపై మురికినీరు, చెత్తాచెదారం లేకుండా నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ సురక్షితమైన తాగునీటిని పరీక్షించి, సురక్షితమైనా తాగునీరేనా? అంటూ అధికారులపై మండిపడ్డారు. ప్రతిరోజూ తాగునీరు అందుతుందా? పూర్తిస్థాయిలో గ్రామాల్లో ఇంటింటికీ తాగునీటిని సరఫరా చేయాలన్నారు. కలుషితమైన తాగునీటిని సరఫరా చేయవద్దని, శుద్ధమైన మంచినీటినే సరఫరా చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా అపరిష్కృతంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు గ్రామస్థులు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో డీఎల్పీవో ఫణిందర్, ఎంపీడీవో రవీందర్, మిషన్ భగీరథ ఏఈ జైపాల్, ఎంపీవో సంతోష్, ఏపీవో భీంరావ్, ఆర్ఐ విలాస్, ఏఎస్సై రమేష్, పంచాయతీ కార్యదర్శి అజ్మత్ పాషా, ఈజీఎస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



గిరిజనులకు కూరగాయల విత్తనాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్, పీవోలు



పురాతన బ్రిడ్జిని పరిశీలిస్తున్న కలెక్టర్



పొన్న గ్రామంలో ఓ ఇంటి వద్ద మిషన్ భగీరథ నీటిని పరీక్ష చేస్తున్న కలెక్టర్

• ఆదిమ గిరిజనులకు విత్తనాలు పంపిణీ

ఉట్నూర్: ఉమ్మడి జిల్లాలోని గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన సమగ్ర జనాభివృద్ధి సంస్థ అధికారులు దశాబ్దాల అనంతరం ఆదిమ గిరిజనుల కోసం కూరగాయాలు, ఆకుకూరల విత్తనాలు పంపిణీ చేయడం శుభపరిణామం అని గిరిజనులు భావిస్తున్నారు. ఉట్నూర్ ఐటీడీఏలో దశాబ్ద కాలంగా ప్రాజెక్టు హార్టికల్చర్ అధికారులు లేకపోవడం వల్ల ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉద్యానవనాలు అలంకారప్రాయంగా మారాయి. గత సంవత్సరం ఉట్నూర్ ఐటీడీఏ హార్టికల్చర్ అధికారిగా నియామకమైన గడిమల సందీప్ కుమార్ ప్రాజెక్టు హార్టికల్చర్ ఆఫీసర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించి అధ్వాన స్థితికి చేరిన ఉట్నూర్, బెల్లంపల్లి, భీమారం, జంబుగా, రాజంపేటలలో ఉన్న ఉద్యానవన కేంద్రాలలో మొక్కల పెంపకంతో పాటు అంట్లు కట్టే విధానాన్ని అభివృద్ధి చేసి పండ్ల మొక్కలు, పూలమొక్కలను విక్రయించడానికి అందుబాటులోకి తెచ్చారు. తొలిసారిగా ఆదిమగిరిజనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్న తరుణంలో ఆదిమ గిరిజనులు పౌష్టిక ఆహారం తీసుకోవాలన్న ఆలోచనతో పీవో ఆధ్వర్యంలో కోలాం, తోటి గిరిజనులను మాత్రమే గుర్తించి ఆకుకూరలు, కాయకూరల విత్తనాల పంపిణీ చేపట్టారు. కలెక్టర్, పీవో నేతృత్వంలో చేపడుతున్న పండ్ల తోటల అభివృద్ధి కార్యక్రమాలను సందీప్‌కుమార్ సవివరంగా తెలపడంతో కలెక్టర్ ఆయనను అభినందించారు.

ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి



ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయంలో జయశంకర్ సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యోగులు



జిల్లాకేంద్రంలో సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్, మున్సిపల్ చైర్మన్



తెలంగాణ సిద్ధాంతకర్తగా, ఉద్యమ స్ఫూర్తి ప్రధాతగా, ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని ఐటీడీఏ ఏపీవో జనరల్ జాదవ్ వసంతరావు అన్నారు. మంగళవారం జయశంకర్ సార్ 85వ జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఉట్నూర్ మండలకేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏపీవో జనరల్ మాట్లాడారు. అదేవిధంగా జిల్లాకేంద్రంలో నిర్వహించిన సార్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాయల శంకర్, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, నాయకులు పాల్గొన్నారు. స్థానిక ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి స్థానిక నాయకులతో పాటు విశ్వబ్రాహ్మణ సంఘం, తుడుందెబ్బ, తదతరుల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అలాగే, జిల్లాలోని బోథ్, ఇచ్చోడ, తలమడుగు, నార్నూర్, ఇంద్రవెల్లి, తాంసి, మావలతో పాటు ఆయా మండలాల్లో జయశంకర్ సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి నివాళులర్పించారు. - న్యూస్ నెట్‌వర్క్



ఇచ్చోడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..



నార్నూర్‌లో నివాళులర్పిస్తున్న అధికారులు



ఇంద్రవెల్లిలోని గ్రంథాలయంలో..



బోథ్‌లో పాల్గొన్న విశ్వకర్మ సంఘం నాయకులు